ప్రమాదకరంగా ట్రాఫిక్ ఐలాండ్స్
2





2
ముగిసిన పాలి సెట్

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

## ఎల్లారెడ్డిలో ముగిసిన కో–ఆప్షన్ సభ్యుల ఎన్నిక

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. మున్సిపల్ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్, వైస్ ఛైర్‌పర్సన్ భాగ్యమ్మ, ఆర్డీవో ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ జీవన్ సమక్షంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో నలుగురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కో-ఆప్షన్ సభ్యులుగా చిట్టిమిల అరుణ, పప్పు వెంకటేశం, షదాబ్, మహమ్మద్ అబ్దుల్ వహీద్ ఎన్నికవగా.. వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారిని పాలకవర్గం ఘనంగా సన్మానించింది. పట్టణ అభివృద్ధిలో సభ్యులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ మేనేజర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం..



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసుల పాత్ర అత్యంత కీలకమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి అన్నారు. మోపాల్‌లో నూతనంగా నిర్మించనున్న పోలీస్ స్టేషన్ నిర్మాణానికి ఏసీపీ ప్రకాష్, సీఐ సురేష్, ఎస్సై సుస్మిత, కాంగ్రెస్ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ నిర్మాణంలో మండలంలోని అన్ని గ్రామాల నాయకులు తమవంతుగా సహకారం అందించడం అభినందనీయమన్నారు. కాగా పోలీస్ స్టేషన్ నిర్మాణానికి తనవంతుగా రూ.10 లక్షలు కేటాయించారు. పోలీస్ స్టేషన్ అంటే కేవలం పోలీసులది మాత్రమే అనే అపోహను ప్రజలు వీడాలని, అది ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేయబడిందని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, రాష్ట్ర కల్లుగీత కార్మిక సహకార కార్పొరేషన్ ఛైర్మన్ శేఖర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోపాల్ సాయి రెడ్డి, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు జలందర్, స్థానిక సర్పంచ్ రవి, మాజీ ఎంపీపీ యాదగిరి, ప్రతాప్ సింగ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి పొలసాని శ్రీనివాస్, రాంచందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేయొచ్చు



**అక్షరటుడే, కామారెడ్డి:** మొబైల్ ఫోన్ పోయిందని కంగారు పడొద్దని, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను తప్పకుండా రికవరీ చేయవచ్చని ఎస్పీ రాజేష్ చంద్ర భరోసా ఇచ్చారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఫోన్లు రికవరీ చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గడిచిన 30 రోజుల్లో ఇన్‌స్పెక్టర్ సంపత్ పర్యవేక్షణలో ఆర్ఎస్సై బాలరాజు, ఐదుగురు కానిస్టేబుళ్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం సాంకేతిక పరిజ్ఞానంతో 115 ఫోన్లను ట్రేస్ చేసిందన్నారు. ఈ ప్రత్యేక బృందం ప్రతి నెలా సగటున 100కు పైగా ఫోన్లను రికవర్ చేస్తూ బాధితుల్లో నమ్మకం పెంచుతోందన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు రూ.79 లక్షల విలువైన 499 ఫోన్లు రికవరీ చేయడం జరిగిందని తెలిపారు. గత ఏడాది రూ.3 కోట్ల విలువైన 1,834 ఫోన్లు బాధితులకు అప్పగించడం జరిగిందన్నారు. సీఈఐఆర్ పోర్టల్ వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు జిల్లాలో రూ.7.64 కోట్ల విలువైన 4,780 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అప్పగించామని పేర్కొన్నారు. ఫోన్ పోతే వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, సిమ్ కార్డును బ్లాక్ చేయించాలని సూచించారు. http://www.ceir.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను బ్లాక్ చేయాలన్నారు. మొబైల్ రికవరీలో చురుకుగా వ్యవహరించిన ప్రత్యేక బృందాన్ని ఎస్పీ అభినందించారు.

## వంజరులు రాజకీయాల్లో రాణించాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** వంజరులు రాజకీయాల్లో చురుకుగా పాల్గొనాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. మామిడిపల్లిలోని వంజరి కల్యాణ మండపంలో నిర్వహించిన ఆ సంఘం జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లా వంజరి సంఘం అధ్యక్షుడిగా మాస్టర్ శంకర్, ప్రధాన కార్యదర్శిగా ధాత్రిక వేణుగోపాల్, కోశాధికారిగా కరిపె మధుసూదన్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన రాజకీయ ప్రస్థానంలో వంజరి కులస్థుల మద్దతు ఎప్పటికీ మరువలేనిదన్నారు. ప్రతి ఎన్నికల్లో.. ప్రతి అడుగులో నాకు అండగా నిలిచిన వంజరి సమాజానికి తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు బోనేకర్ భూమయ్య, మాజీ కార్యదర్శి మల్లేష్, మాజీ కోశాధికారి నర్సయ్య, రాష్ట్ర వంజరి సంఘం అధ్యక్షుడు కాలేరు నరేష్, కార్యదర్శి కొండల్, కోశాధికారి అమరేందర్, మాస్టర్ శ్రీనివాస్, సర్పంచ్ కూన లలిత సాగర్, గంగోనె గంగాధర్, గంగోనె సంతోష్, గోపాల్ శ్రీధర్, కరిపే గణేష్, అమంద్ విజయ్ కృష్ణ, బర్దన్ సతీష్, నవతే సతీష్, పటేవార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపార కేంద్రాలుగా సెల్లార్లు



**కామారెడ్డిలో అనుమతులు లేకుండా సెల్లార్లు నిర్మిస్తున్నారు. పార్కింగ్ కోసమని చెప్పి.. పలువురు వ్యాపార కేంద్రాలుగా వినియోగిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. నాలుగైదంతస్తుల భవనాల నిర్మాణం చేపట్టడమే కాకుండా ప్రతి భవనానికి కింద సెల్లార్ ఏర్పాటు చేస్తున్నారు. పార్కింగ్ కోసమని మున్సిపాలిటీకి దరఖాస్తు చేసుకున్నా క్షేత్రస్థాయిలో మాత్రం బిజినెస్ చేస్తున్నారు.** - అక్షరటుడే, కామారెడ్డి

- అనుమతులు లేకుండా నిర్మాణం
- పార్కింగ్ కోసం కాకుండా బిజినెస్ కోసం వాడకం
- పట్టించుకోని అధికారులు

కామారెడ్డి పట్టణంలో భవన నిర్మాణ నిబంధనలు పూర్తిగా నీరుగారిపోతున్నాయి. వాహనాల పార్కింగ్ కోసం కేటాయించాల్సిన సెల్లార్లను యాజమాన్యాలు వ్యాపార సముదాయాలుగా మార్చేస్తున్నాయి. అనుమతులు లేకుండా సాగుతున్న ఈ దందాపై అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. చర్యలు తీసుకోవడంలో అధికారులు మాత్రం మనకెందుకులే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.

### అనుమతులు లేకుండానే..

పట్టణంలో పాత భవనాలతో పాటు కొత్తగా వెలుస్తున్న వాణిజ్య భవనాల్లో చాలా వరకు సెల్లార్లకు అసలు అనుమతులే లేవు. భవన నిర్మాణ ప్లాన్‌లో పార్కింగ్ చూపించి, క్షేత్రస్థాయిలో మాత్రం షాపులు, గోదాములు, హాస్పిటల్స్‌లో అయితే ల్యాబ్‌లుగా మార్చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు చేయకపోవడంతో యజమానులకు అడ్డూ అదుపు లేకుండా పోతుందన్న విమర్శలున్నాయి.

### రోడ్లపైనే పార్కింగ్

షాపింగ్ మాల్స్, ఆస్పత్రుల వద్ద ఏర్పాటు చేసుకున్న సెల్లార్లను వ్యాపారానికి వాడేస్తుండడంతో వాహనాల పార్కింగ్ సమస్య తీవ్రమైంది. షాపులకు వచ్చే వినియోగదారులు, భవనాల్లో పనిచేసే ఉద్యోగులు తమ వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. దీంతో ప్రధాన రోడ్లు రద్దీగా మారి ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. సాయంత్రం వేళల్లో నిజాంసాగర్ చౌరస్తా, బస్టాండ్ రోడ్డు, ఇందిరా చౌక్‌లలో పరిస్థితి దారుణంగా ఉంటున్నా అధికారులకు కనిపించక పోవడం గమనార్హం.

### భద్రత గాలికి..

సెల్లార్‌లో ఒక చదరపు అడుగు అద్దెకు ఇస్తే నెలకు వేలల్లో వస్తుండడంతో యాజమాన్యాలు పార్కింగ్‌ను పూర్తిగా పక్కనబెట్టాయి. అయితే ఇది ప్రజల భద్రతకు సమస్యగా మారుతోంది. సెల్లార్లలో అగ్నిప్రమాదం జరిగితే సహాయక చర్యలకు కూడా అవకాశం ఉండదు. వెంటిలేషన్ లేకపోవడం, ఒకే ఒక దారి ఉండడంతో ప్రమాద తీవ్రత పెరిగే అవకాశం ఉంది. ఫైర్ సేఫ్టీ నిబంధనలు అసలు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. నిబంధనల ప్రకారం 15 మీటర్ల కంటే ఎత్తయిన ప్రతి వాణిజ్య భవనంలో సెల్లార్ పార్కింగ్ తప్పనిసరి. నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన భవనాలను సీజ్ చేసే అధికారం మున్సిపాలిటీకి ఉంది. అయితే కామారెడ్డి మున్సిపల్ పరిధిలో 60 శాతం భవనాల్లో ఈ నిబంధన ఉల్లంఘన జరుగుతున్నా చర్యలు మాత్రం శూన్యం. ఒకవేళ ఫిర్యాదులు వచ్చినా నోటీసులు ఇవ్వడంతో సరిపెడుతున్నారు.

### అధికారుల ప్రేక్షక పాత్ర

కేవలం ఆదాయమే పరమావధిగా భవన యజమానులు వ్యవహరిస్తుంటే, అధికారులు మాత్రం ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. నిబంధనలు పాటించని భవన యజమాన్యాలపై చర్యలకు వెనుకంజ వేస్తున్నారు. షాపింగ్ మాల్స్, ఆస్పత్రుల యాజమాన్యాలకు రాజకీయ పలుకుబడి ఉండడంతో అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్, టౌన్ ప్లానింగ్ శాఖలు స్పందించి అక్రమ సెల్లార్ వ్యాపారాలపై ఉక్కుపాదం మోపకపోతే రానున్న రోజుల్లో పట్టణంలో ట్రాఫిక్, భద్రత సమస్యలు మరింత జటిలం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

### సెల్లార్లకు అనుమతి లేదు



మున్సిపల్ యాక్ట్ ప్రకారం భవనాల నిర్మాణాలకు సెల్లార్ అనుమతి లేదు. గ్రౌండ్ ఫ్లోర్ నిర్మించి పార్కింగ్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఇప్పటివరకు నిర్మించిన వాటికి మాత్రం జరిమానాలు వేసి, సీజ్ చేసే అధికారం మాత్రమే మాకు ఉంది. అందులో షాపుల నిర్వహణపై ఏమి చేయలేం. భవిష్యత్తులో బారీ భవనాల నిర్మాణాలకు ఎట్టిపరిస్థితుల్లో సెల్లార్ అనుమతులు ఇవ్వం.

**– పర్వతాలు, మున్సిపల్ కమిషనర్**





## నిజామాబాద్ డీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన గీత

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ డీఆర్వోగా బి.గీత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం డీఆర్వో గీత మాట్లాడుతూ.. జిల్లాలో రెవెన్యూ పరిపాలనకు సంబంధించి ఉన్నతాధికారి, ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ.. సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఏవైనా ఇబ్బందులు తనను సంప్రదించవచ్చని చెప్పారు. నిజామాబాద్ డీఆర్వోగా గీత బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పూలమొక్కను అందజేశారు. అనంతరం జిల్లాలో పరిస్థితులపై డీఆర్వోకు పలు సూచనలు చేశారు. గీత హైదరాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ నివాస విద్యాసంస్థల సొసైటీ లో అడిషనల్ సెక్రెటరీగా పనిచేశారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన అదనపు కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా నిజామాబాద్‌కు వచ్చారు. ఆమె తహశీల్దార్ స్థాయి నుంచి డీఆర్వో స్థాయికి పదోన్నతులు పొందారు.


## జనగణనలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలో నిర్వహిస్తున్న జనగణన కార్యక్రమంలో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. జనగణన పోర్టల్ ద్వారా అధికారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు జనగణనలో తప్పనిసరిగా పాల్గొని తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. జనగణన ద్వారా ప్రభుత్వానికి సమగ్ర సమాచారం లభిస్తుందని, ఆ సమాచారం ఆధారంగా అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయడానికి సహాయ పడుతుందని తెలిపారు. అధికారులు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి జనగణన ప్రక్రియను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## సామాన్యులకు చుక్కలు చూపిస్తున్న పసిడి..ఒకేరోజు రూ.వేలల్లో పెరుగుదల

**అక్షరటుడే, కామారెడ్డి:** పసిడి కొనాలనుకునే వారికి ఇది బ్యాడ్ న్యూస్. బంగారం ధర మళ్లీ కొండెక్కింది. కామారెడ్డిలో ఇవాళ తులం రేటు అక్షరాల రూ.1,58,800 లకు చేరింది. నిన్నమొన్నటి వరకు రూ.1.52 లక్షలు ఉన్న ధర ఒక్కసారిగా రూ.6 వేలు ఎగబాకడంతో జనం జంకుతున్నారు. వెండి కూడా సామాన్యుడికి అందకుండా పోతోంది. రూ.2,500 వద్ద ఉన్న వెండి ఇవాళ రూ.2,730కి చేరి షాక్ ఇచ్చింది. పెళ్లిళ్ల





సీజన్‌లో ఇలా రేటు మంట పుట్టించడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా కస్టమ్స్ డ్యూటీని పెంచడంతో బంగారం, వెండి ధరలు అమాంతం పెరిగాయి. ఇటీవల హైదరాబాద్ పర్యటనలో ప్రధాని మోదీ 'ఏడాది పాటు బంగారం జోలికి వెళ్లవద్దు' అని సూచించిన విషయం తెలిసిందే. బంగారం కొనుగోళ్లను తగ్గించే చర్యల్లో భాగంగా కస్టమ్స్ డ్యూటీని పెంచారు. రాబోయే రోజులు రేటు ఇంకా పెరిగే ఛాన్స్ ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

## రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** అకాలవర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆమె బుధవారం రైస్ మిల్లులలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. లారీల రాకపోకలు.. మిల్లింగ్ విధానాన్ని పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఖానా పూర్‌లోని లక్ష్మీ బాలాజీ రైస్ మిల్, శ్రీ సిద్ధి రామేశ్వర మిల్లులను కలెక్టర్ సందర్శించారు. మిల్లులకు కొనుగోలు కేంద్రాల నుంచి ఎన్ని లారీల ధాన్యం పంపించారు.. వాటిని దిగుమతి చేసుకున్నారా.. ఎంత పరిమాణంలో మిల్లింగ్ జరిపారానే విషయాలను తెలుసుకున్నారు. మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ఎలా భద్రపరుస్తున్నారనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మిల్లుల వద్ద ఏమైనా తరుగు తీస్తున్నారా అని ఆరా తీశారు. ఎక్కువగా ఏ రకం ధాన్యం వస్తోందని విచారణ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యాన్ని వెనువెంటనే దిగుమతి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ధాన్యం నిల్వలను సకాలంలో దించుకోకపోతే వర్షాల వల్ల తడిచిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. అవసరమైతే ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సామర్థ్యం మేరకు పూర్తి స్థాయిలో మిల్లింగ్ చేయాలని సూచించారు. ధాన్యం నిల్వలు, మిల్లింగ్ చేసిన బియ్యాన్ని జాగ్రత్తగా భద్రపర్చాలన్నారు. ధాన్యం నిల్వ చేసేందుకు సమీపంలోని రైతు వేదికలను వినియోగించుకోవాలని తెలిపారు. మిల్లుల వద్ద ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునే విషయంలో జాప్యానికి తావులేకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లయ్స్ డీఎం ప్రవీణ్, రైస్ మిల్లుల నిర్వాహకులు మోహన్ రెడ్డి, శ్రవణ్ కుమార్ తదితరులున్నారు.




## ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిశీలన



**అక్షరటుడే, ఆర్మూర్:** వేల్పూర్ మండలంలోని లక్కోర గ్రామంలో బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యూనిటీ అధికారి డాక్టర్ అశోక్ తనిఖీ చేశారు. చిన్నపిల్లలకు ఇస్తున్న వ్యాక్సిన్ వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంఎల్ హెచ్‌పీ శ్రావణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఎన్ఎంలు భాగ్య , మీనా ఆశ వర్కర్లు భూలక్ష్మి, సుకన్య, కళావతి, ఇతర సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇమ్యునైజేషన్ అధికారి తరుణ్, సర్పంచ్ దాసరి అపర్ణ రాజు, పంచాయతీ సెక్రెటరీ విజయ్ కుమార్, వార్డ్ మెంబర్ సృజన్ గౌడ్ పాల్గొన్నారు.


## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని రైతు వేదికలో బుధవారం విద్యా వార్షికోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో పట్టణాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న వసతులు సౌకర్యాలు విద్యా ప్రమాణాలను వివరించారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులు చేరేలా చూడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థకు పెద్దపీట వేస్తోందని, కార్పొరేట్  పాఠశాలలు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలో నాణ్యమైన విద్యావ్యవస్థను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కాటిపల్లి వెంకటరెడ్డి, తహశీల్దార్ సత్యనారాయణ, ఆర్మూర్ ఆలూరు ఎంఈవోలు రాజా గంగారం, నరేందర్, ఆర్మూర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ తిరుక్కోవెల వేణుగోపాలస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా ట్రాఫిక్ ఐలాండ్స్..



నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఐలాండ్స్ ప్రమాదకరంగా మారాయి. ట్రాఫిక్ నియంత్రించే సిబ్బంది కూర్చునేందుకు వీటి ఏర్పాటు చేశారు. అయితే కొత్త కలెక్టరేట్, రైల్వేస్టేషన్, ఆర్ఆర్ చౌరస్తా వద్ద ఉన్న ఐలాండ్స్ శిథిలావస్థకు చేరాయి. ఇవి విరిగిపోయి ఎప్పుడు రోడ్డుపై పడతాయోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– అక్షరటుడే, ఫొటోగ్రాఫర్ నిజామాబాద్



## అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో మాస పూజ



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం మాస పూజ చేశారు. అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు పుట్టి మురళి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. నగేష్ శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో పూజ, మెట్ల పూజ నిర్వహించిన అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్మూర్ అయ్యప్ప సేవా సమితి ప్రధాన కార్యదర్శి మీసాల రవి, కోశాధికారి గాజ రెడ్డి నర్సారెడ్డి, గౌరవాధ్యక్షుడు పెంట జలంధర్, గౌరవ సలహాదారులు జనార్దన్ గౌడ్, రెడ్డి ప్రకాష్, గంట విప్లవ్, మామిడిపల్లి దత్తు ప్రభు, పూల నర్సయ్య, సహాయ కోశాధికారి షేర్ ఒడ్డెన్న, ఉపాధ్యక్షులు నందు, పూల ప్రసాద్, అశోక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జన్నెపల్లి రంజిత్, స్వాములు ధన్‌పాల్ శివ, కౌన్సిలర్ నర్మే నవీన్, మీసాల రాజేశ్వర్,  మహేష్, కౌటికే విజయ్, ధ్యాగ ఉదయ్, గంగాధర్ గౌడ్, సర్జికల్ రాజేష్, నవీన్, రాజశేఖర్, జంబి హనుమాన్ ఆలయ కమిటీ డైరెక్టర్ నారాయణ, భోజన్న పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిలో ఘనంగా విద్యావారోత్సవాలు




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి పట్టణంలో విద్యా వారోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎంఈవో రాజులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్‌లు, పురపాలక సభ్యులకు పాఠశాల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంపై వర్క్‌షాప్ కల్పించారు. పాఠశాల విద్య ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, ఏఎంసీ ఛైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, ఆత్మ కమిటీ సభ్యుడు దశరథం, మున్సిపల్ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్, ఎంపీడీవో, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ

**అక్షరటుడే, బాల్కొండ:** బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన మొదటి సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్షలకు మొత్తం 50 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా.. 49 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్షలకు ఆరుగురు విద్యార్థులు హాజరయ్యారని అధికారులు తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, వైద్య సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసినట్లు కళాశాల సెంటర్ సూపరింటెండెంట్ రజీయుద్దీన్ అస్లాం తెలిపారు.

## ముగిసిన పాలిసెట్ పరీక్ష



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డిలో పాలి సెట్  2026 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షల కోసం ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 2,643 విద్యార్థులకు గాను 2,502 మంది విద్యార్థులు హాజరు కాగా 141 మంది గైర్హాజరయ్యారు. ఇందులో బాలురు 1,117, బాలికలు 1,385 కాగా 95 శాతం హాజరు నమోదైంది. పాలిసెట్ సమన్వయకర్త డాక్టర్ కె. విజయకుమార్‌తో పాటు ప్రత్యేక పరిశీలకుడు ఆర్.మోహన్ కుమార్ సెంటర్లను సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.

## కార్పొరేటర్లకు అవగాహన సదస్సు

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం విద్యావారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ దక్షిణ మండల ఎంఈఓ సాయ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లకు విద్యా వారోత్సవాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారికి విద్యా ప్రణాళికకు సంబంధించిన వివరణాత్మక కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, మేయర్ కూరగాయల ఉమారాణి, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నిజామాబాద్ ఉత్తర మండల ఎంఈఓ ఎన్వీ గౌడ్, 40 మంది కార్పొరేటర్లు, డీఆర్పీలు విష్ణు ప్రసాద్,అలీం, రాకేష్, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## పనులు నాణ్యతతో చేపట్టాలి




**అక్షరటుడే, ఆర్మూర్ :** డ్రెయినేజీ నిర్మాణ పనులను నాణ్యతతో  చేపట్టాలని ఆర్మూర్ కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ రెడ్డి సూచించారు. పట్టణంలోని 25, 26, 27 వార్డుల పరిధిలో జరుగుతున్న డ్రెయినేజీ అభివృద్ధి పనులను స్థానిక నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. టీఎఫ్‌యూఐడీసీ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.50 లక్షల నిధులను ఆర్మూర్ నియోజకవర్గానికి కేటాయించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. వర్షాకాలంలో ఈ వార్డుల్లో మురికినీరు రోడ్లపైకి చేరి తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారన్నారు. ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నిధులు సమకూర్చుకున్నామని.. పనులు వేగంగా నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రసాద్, రమేష్, గంగూలీ, సృజన్, పండిట్ పవన్, డైరెక్టర్ వాసు, నాయకులు దామోదర్, జిమ్మీ రవి, చిట్టి రెడ్డి, మారుతి రెడ్డి, రవికాంత్ రెడ్డి, శ్రీను, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల అభివృద్ధి తోడ్పాటు అందించాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలో ప్రజా పాలన - ప్రగతి పాలనలో భాగంగా విద్యా వారోత్సవాలు కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం కళాశాలకు సంబంధించిన అకడమిక్,  జాబ్ డ్రైవ్‌లో విశిష్ట సేవలు అందించిన అధ్యాపకులైన జంగం శివకుమార్, అరుణ్ కుమార్, అధ్యాపకేతర బృందం నుంచి జంగం వసంతలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. అలాగే ఫస్ట్ సెమిస్టర్ నుంచి ఆరవ సెమిస్టర్ వరకు బ్యాక్‌లాగ్స్ లేకుండా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సీమ, భానుప్రియ, హబీబ్ ఉన్నీసా బేగం, అరుణ్‌లను సైతం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధికి అధ్యాపకులు ఎల్లవేళలా తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, టీఎస్‌కేసీ సమన్వయకర్త శివకుమార్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు  చంద్రకాంత్, రాణి, అధ్యాపకులు నాగానిక,అరుణ్ కుమార్, సిద్ధిరాజు, కృష్ణప్రసాద్, గోదావరి,సురేష్ రెడ్డి, దశరథ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాలకు లారీలను తరలిస్తున్న అధికారులు




**అక్షరటుడే, ఇందూరు:** జిల్లావ్యాప్తంగా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో యాసంగి సీజన్‌లో ధాన్యం సేకరణను వేగవంతం చేశారు. లారీలను సమకూర్చుకుని త్వరితగతిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఆదేశించిన విషయం తెలిసిందే.  ఈ నేపథ్యంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో లారీల తనిఖీలు చేపట్టారు. మాధవనగర్ఆర్వోబీ ప్రాంతంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ దుర్గాప్రమీల నేతృత్వంలో బుధవారం ఉదయం ఎంవీఐ కిరణ్, ఇతర అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఖాళీగా వెళ్తున్న లారీలను ఆపి కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ఖాళీగా ఉన్న లారీలను అధికారుల సూచనల మేరకు తప్పనిసరిగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేవలందించాలని సూచించారు. లేని పరిస్థితిలో కలెక్టర్ సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని డీటీసీ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ సీజన్‌లో 86 లారీలను ప్యాడీ సెంటర్లకు తరలించినట్లు తెలిపారు. ఖాళీగా ఉన్న లారీలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు ఆరు మొబైల్ టీంలను సివిల్ సప్లయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో రవాణా శాఖ అధికారులు సైతం ఉన్నారన్నారు. మాధవ నగర్ వంతెన వద్ద, జగిత్యాల వైపు వెళ్లే మార్గంలో, అంకాపూర్ వద్ద, బాల్కొండ జాతీయ రహదారిపై, నందిపేట్ సమీపంలో, మరో మొబైల్ టీం పనిచేస్తున్నాయని చెప్పారు.

## వడదెబ్బకు గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి: డీఎంహెచ్‌వో




**అక్షరటుడే, మెండోరా:** వడదెబ్బకు గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు. పోచంపాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో పీహెచ్‌సీలోని లాబరేటరీ, మందుల నిల్వ గదులను క్షుణంగా పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఎండాకాలంలో సంభవించే వడదెబ్బపై మండలంలోని గ్రామాల్లో ఆశా కార్యకర్తల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. 14 ఏళ్ల బాలికలు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకునేలా విస్తృత ప్రచారం చేయాలని ఆమె వైద్యాధికారి మద్దుల రాజేష్‌ను ఆదేశించారు.

## ఉపాధి పనులను త్వరగా ముగించుకోవాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని బాబాపూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో సంతోష్ కుమార్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో చేపట్టిన సీసీటీ పనుల నాణ్యతను తనిఖీ చేసిన ఆయన.. కూలీలు చేస్తున్న పని పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, కావున కూలీలు తమ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉదయం వేళల్లోనే పనులను ముగించుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. కూలీల కోసం చల్లని తాగునీటి సదుపాయం కల్పించాలని..ప్రస్తుతం రోజుకు కనీస కూలి రూ.300 వస్తుండటంపై కూలీలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలోని మరింత మంది అర్హులైన కూలీలను పనిలోకి చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో జీ.నర్సయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ మధుసూదన్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.